
30న ఎన్ఆర్ఐ కోటా కౌన్సిలింగ్

ఏజీవర్సిటీ: ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం సంయుక్తంగా అందిస్తున్న డ్యుయల్ డిగ్రీ కోర్సులకు ఈనెల 30న వాక్ ఇన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ విద్యాసాగర్ తెలిపారు. ఎన్ఆర్ఐ కోటాలో బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజినీరింగ్), కోర్సులలో సీట్ల భర్తీకి ఈ కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.

స్పందించి.. మరమ్మతు చేసి!



శాస్త్రిపురం: 'వెలగని వీధి దీపాలు'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. హసన్‌నగర్ బస్తీతో పాటు ఇతర ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. వీధి దీపాలు వెలగడంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు రఘుయాదవ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని వెంకటేశ్వరకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు అక్కెం రఘుయాదవ్ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రకళ, శిరీష, సి.అరుణ్‌ముదిరాజ్, మహేష్, అరుణరెడ్డి, సరితా, సుగుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డబ్ల్యూఈడీపీ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (డబ్ల్యూఈడీపీ) మంగళవారం విజయవంతంగా ముగిసింది. భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్, నీతిఆయోగ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని యువ, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభావవంతమైన చొరవగా అభివర్ణించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



చిట్టి చేతులతో మట్టి గణపతులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీహిల్స్ కాలనీ యానస్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో మట్టి గణనాథుల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అసోసియేషన్ సభ్యులు చిన్నారులకు ఈ పోటీలను నిర్వహించారు. దాదాపు 112 మంది చిన్నారులు మట్టి గణపతులను తయారు చేశారు. పిల్లలకు చిన్ననాటి నుంచే పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అవగాహన కల్పిస్తున్నా మని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు, మెమోంటోలు అందజేసి అభినందనలు తెలిపారు.



మట్టి వినాయకులను తయారు చేసిన చిన్నారులు

మార్కెట్లకు పండగ శోభ

- జోరుగా పూలు, పండ్లు, పూజా సామగ్రి విక్రయాలు
- ప్రత్యేక అలంకరణలో ముస్తాబైన మండపాలు
- వినాయక ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు

వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో కిక్కిరిసిన మార్కెట్లు



వినాయక పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాజేంద్రనగర్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన మార్కెట్లకు పండుగ శోభ సంతరించుకుంది. ఉదయం నుంచి మరుసటి రోజు తెల్లవారు జాము వరకు మార్కెట్లలో పూలు, పండ్లు, వినాయక విగ్రహాలు, పూజా సామగ్రిని కొనుగోళ్లతో కిటకిటలాడియి. సూపర్ మార్కెట్లతో పాటు దుకాణాల్లో ఈ ఏటా రద్దీ పెరిగింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గూడారాల్లో సైతం విక్రయాలు జోరుగా సాగాయి. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండటంతో పాటు తేలికపాటి వర్షం కురియడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది.

ముస్తాబైన మండపాలు...

గణేష్ పండుగ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో గణేష్ మండపాలు ముస్తాబయ్యాయి. బుధవారం ఉదయం నుంచి ఈ మండపాలలో గణనాథున్ని ప్రతిష్టించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో పాటు ప్రత్యేక లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. మండపాలను సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం ఉదయం నుంచి విగ్రహ ప్రతిష్టాపనలు కొనసాగనున్నాయి.

ఉచిత విగ్రహాల పంపిణీ...

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్, మణికొండ, నార్సింగ్ మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీలు, రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్, బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలో జీహెచ్ఎంసీతో పాటు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ పరిరక్షణ కమిటీల ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ కొనసాగింది. ప్రధాన కూడళ్లు, బహిరంగ మార్కెట్లు, కాలనీలు, అపార్ట్‌మెంట్ల వారిగా వీటిని పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను తీసుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపారు.



తాత్కాలిక గూడారాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయకులు

ప్రత్యేక గూడారాలు...

నియోజకవర్గ పరిధిలోని ప్రధాన మార్కెట్లతో పాటు కాలనీల్లో వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక గూడారాలను ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఈ గూడారాల ద్వారా గణేష్ ప్రతిమలు, గణేష్ పూజ సామగ్రి, పండ్లు, ఫలాలు తదితర వాటిని విక్రయించారు.

భారీగా పెరిగిన ధరలు...

గత సంవత్సరం కంటే వినాయక ప్రతిమల రేట్లు భారీగా పెరిగాయని పలువురు వెల్లడించారు. మట్టి గణపతులతో పాటు ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసిన విగ్రహాల ఖరీదు భారీగా ఉన్నాయని వెల్లడించారు. పూలు, పండ్ల ధరలు సైతం రెట్టింపు స్థాయిలో పెరిగాయని ప్రజలు వెల్లడించారు. పూల ధరాలు ఆకాశన్నంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడటంతో పూల దిగుబడి తగ్గిందని.. అందుకే రేట్లు పెరిగాయని విక్రయదారులు వెల్లడించారు.



విక్రయానికి సిద్ధంగా వినాయక లడ్డూలు

భారీ బందోబస్తు...

గణేష్ ఉత్సవాల నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండపాల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రత్యేక పికెటింగ్‌లను సైతం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. శంషాబాద్ ఆర్‌జీఐ, నార్సింగ్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నాం

బండ్లగూడ: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని కృష్ణానగర్ కాలనీలో గత కొంత కాలంగా డ్రైనేజీ పైపులైన్‌లు నిండిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను ఆయన దృష్టికి తీసుకురావడంతో అధికారులతో మాట్లాడి జట్టింగ్ మెషీన్‌తో శుభ్రం చేయించారు. అలాగే ఓంనగర్ కాలనీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తీగుళ్ల శాములుగౌడ్, జంగయ్య, లక్ష్మణ్, ప్రవీణ్, రవికుమార్‌గౌడ్, శ్రీనాథ్, సిద్ధూ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు సురేష్‌గౌడ్

గో గ్రీన్ గణేశా..

అత్తాపూర్: హైదర్‌గూడలోని షిండే ఆర్ట్ ఎడ్యుకేషన్‌లో మంగళవారం 'గో గ్రీన్ గణేశా..'అనే పేరుతో పర్యావరణహిత గణేశ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేసి సహజసిద్ధమైన రంగులను అద్దారు. పర్యావరణ పరిరక్షణను ప్రొత్సహించాలనే ఉద్దేశంతో ఆ విగ్రహాలలో మొక్కల విత్తనాలను పెట్టి ఔరా అనిపించారు. దీనినే సీడ్ గణేశా అని అంటారని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షిండే ఆర్ట్ ఎడ్యుకేషన్ హెడ్‌లు హరిరథన్ షిండే, విజయ షిండే తదితరులు పాల్గొన్నారు.



మట్టి గణనాథులను తయారు చేసిన చిన్నారులు

రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

శంషాబాద్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలో విద్యార్థులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారిపై. ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ కేంద్ర కమిటీ సభ్యురాలు ఝాన్సీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫీజుల నిలిపివేతతో విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు అని అన్నారు. ఇది ప్రభుత్వాలు వేసే భిక్షకాదని స్పష్టం చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చందు, ప్రదీప్,చరణ్, పవన, భరత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోని చెత్తను కార్మికులకే అందించాలి



శాంతినగర్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు ఇంట్లోని చెత్తను ప్రతి రోజు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్టేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మర్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళారం 3వ డివిజన్‌లోని శాంతినగర్ ఫేస్–4లో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం వారికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల సమస్యలను పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్

మైలార్‌దేవ్‌పల్లి: అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. కాటేదాన్‌లోని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో సీఐటీయూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు వేతనం రూ.26వేలకు పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే భారీ ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక...

శేరిలింగంపల్లి ప్రాజెక్టు నూతన కమిటీ అధ్యక్షురాలుగా నాగమణి, కార్యదర్శిగా సుధా, కోశాధికారిగా అనిత, ఉపాధ్యక్షురాలుగా శ్రీలత, షమీం, సహాయ కార్యదర్శిగా మాధవి, సువర్ణ, కమిటీ సభ్యులుగా 15 మందిని ఎన్నుకున్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం

ఏపీఏఎం విద్యావేత్తగా ప్రొ. ఘనశ్యామ్ కృష్ణ



రాయదుర్గం: హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ ఎం ఘనశ్యామ్‌కృష్ణ ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ మెటీరియల్స్(ఏపీఏఎం) విద్యావేత్తగా ఎన్నికయ్యారు. ఆయన స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సీనియర్ ప్రొఫెసర్. సన్నని ఫిల్మ్‌లు, నానో‌స్ట్రక్చర్డ్ మెటీరియల్స్, సెన్సార్ల రంగాలపై ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవకాశం లభించింది. ఏపీఏఎం అనేది ఆస్ట్రేలియా, రష్యా, భారతదేశం, చైనా, జపాన్, కొరియా, తైవాన్, సింగపూర్, హాంకాంగ్, మంగోలియా, ఉజ్బెకిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్ దేశాల సభ్యులతో ఏర్పడిన సంఘం. 20 మంది పీహెచ్‌డీ విద్యార్థులను పర్యవేక్షించారు. ప్రస్తుతం హెచ్‌సీయూలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలి



ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులను సత్కరించిన మాజీ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత ఎన్నికల వ్యవస్థపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెడ్ గర్ల్, హెడ్ బాయ్ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నోటిఫికేషన్, నామినేషన్లు, నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పించారు. మొత్తం 1040 మంది విద్యార్థులు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్‌లో పాల్గొని తమ నాయకులను ఎన్నుకున్నారు. బాలికల విభాగంలో 10వ తరగతి విద్యార్థిని కావేరి తన సమీప ప్రత్యర్థిపై 54 ఓట్ల తేడాతో గెలుపొందింది. బాలుర విభాగంలో 10వ తరగతి విద్యార్థి ఎం. వివేక్ ఒక ఓటు తేడాతో గెలుపొందారు. వారిని ఆయన సత్కరించి అభినందనలు తెలిపారు. వీరితో పాటు మ్యాజిక్ బస్ సంస్థ నుంచి ఎడ్యుకేషన్, ఎండీఎం, స్పోర్ట్స్, కల్చలర్, ఈకో క్లబ్, హెల్త్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, బీజేపీ నాయకులు బి.రవికాంత్‌రెడ్డి, సి.బీరప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం.. మట్టి గణపతుల రూపం

మైలార్‌దేవ్‌పల్లి: పర్యావరణ పరిరక్షణకు గణేశ్ నవరాత్రి ఉత్సవాలలో మట్టి గణనాథులనే పూజించాలని శ్రీరాంనగర్ పాఠశాల సాంస్కృతి కమిటీ చైర్మన్ ఎస్.కె.అల్లావలి కోరారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు మట్టి గణనాథులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయురాలు లత తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ్‌నగర్ పాఠశాలలో మట్టి వినాయకులను అందజేస్తున్న పాఠశాల సాంస్కృతి కమిటీ చైర్మన్ ఎస్.కె.అల్లావలి

హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో..

రాజేంద్రనగర్ మండలం మైలార్‌దేవ్‌పల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మట్టి గణనాథులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ మదగని, ఉపాధ్యాయురాలు రాధారాణి ప్రొత్సాహంతో మట్టి గణపతులను తయారు చేశారు. కాలనీవాసులు మట్టి గణపతులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులకు చదువుతో పాటుగా ఇలాంటి సృజనాత్మకతను ప్రొత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

శంషాబాద్: మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. హిమబిందు కోరారు. మంగళవారం కళాశాలలోని విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి మట్టి వినాయక ప్రతిమలను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుప్రకాష్, అసిస్టెంట్ ప్రొ. డా. సామ రవీందర్‌రెడ్డి, ఎకోక్లబ్ కోఆర్డినేటర్ డా. వెంకటేష్‌గౌడ్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి..

మణికొండ: ప్రకృతికి పెద్దపీట వేసి నిర్వహించుకునే వినాయక చవితికి మట్టి వినాయకులనే పూజించాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ అన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్, పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాలలతో పాటు హుడాకాలనీ, ఆర్‌కే సర్కిల్‌లలో మంగళవారం ఆయన మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రకృతిని పరిరక్షించే సదుద్దేశంతోనే పండగను నిర్వహించుకోవాలన్నారు. అది చాటి చెప్పడానికే పూజలో 21 రకాల పత్రిని వాడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి యాదయ్య, నవసేవా సంకల్ప ట్రస్ట్ అధ్యక్షుడు మణి, కాంగ్రెస్ నాయకుడు బి.శ్రీరాములు, కస్తూరి శ్రావణ్కుమార్, గంగాధర్, రమేష్‌బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, అధ్యాపకులకు మట్టి గణపతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డా. హిమబిందు



అలకాపూర్ ఎంజీ పార్కులో మట్టివినాయకులను పంపిణీ చేసిన ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ



హుడాకాలనీలో మట్టి వినాయకులను పంపిణీ చేసిన నవసంకల్ప ట్రస్ట్ సభ్యులు